# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 సంచిక : 300 శనివారం 14 మార్చి 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com


# గ్యాస్ బుకింగ్‌లో అవస్థలు

- సిలిండర్ డెలివరీకి వారంపైగా గడువు!
- ఆన్‌లైన్ బుకింగ్‌లో అవస్థలు
- గ్యాస్ ఏజెన్సీల వద్దకు జనం పరుగులు
- వాణిజ్య సిలిండర్ల కొరతతో కట్టెలకు డిమాండ్
- ఒకటి, రెండు రోజుల్లో సిలిండర్ రావాల్సింది
- ఇప్పుడు వారం రోజుల సమయం



హైదరాబాద్

పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం వల్ల గ్యాస్ కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇంటి అవసరాల కోసం గ్యాస్ వినియోగదారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తవని సర్కార్ ప్రకటిస్తూనే ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. పలు ప్రాంతాల్లో సిలిండర్ బుకింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ మార్గాలు - మిగతా3లో



## దేశరైతులను ఆదుకోవడానికి కృషి

- కాంగ్రెస్ మాత్రం అసత్య ప్రచారాలకే పరిమితం
- అసోంలో ప్రధాని మోదీ పర్యటన
- పీఎం కిసాన్ నిధులు రిలీజ్
- ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించిన మోదీ



## మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు

పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే: రాంచందర్ రావు

మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇండ్లు కూలిస్తే సహించేది లేదు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు హెచ్చరిక

మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోంది

హైదరాబాద్

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, - మిగతా3లో



## ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీల దుకాణం
- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని

## రాజ్యాంగం ప్రజల గొంతుక

- గాడ్సే, వీర్‌సావర్కర్‌ది కాదు
- 'సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు'
- సంవిధాన్ సమ్మేళన్ కార్యక్రమం
- కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ- కేంద్రంపై విమర్శలు
- అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే



## ఆర్టీసీలో సమ్మె సైరన్

యాజమాన్యానికి నోటీసు ఇచ్చిన జేఏసీ నేతలు

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ చేపట్టాలని డిమాండ్

ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన జేఏసీ నేతలు

ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపుసంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్



హైదరాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ ఎండీ లేకపోవడంతో ఈడీ వెంకన్నకు నోటీసు పత్రాన్ని అందించారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.350 కోట్లలో ఎటువంటి కోతలు, షరతులు లేకుండా సక్రమంగా విడుదల చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ ఉన్న రూ.2,500 కోట్ల పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత - మిగతా3లో



## భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దు

- దేశంలో ఎల్‌పీజీ కొరత లేదు: కేంద్రం
- ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు 48వేల కిలో లీటర్ల కిరోసిన్
- కమర్షియల్ సిలిండర్ల ప్రాధాన్యతా పంపిణీ బాధ్యత రాష్ట్రాలదే
- వాణిజ్య వినియోగదారులంతా పీఎన్‌జీ కనెక్షన్లు తీసుకోవచ్చు
- భారత చమురు శాఖ కీలక ప్రకటన

## తెలంగాణ జిల్లాలకు మహర్దశ

- ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు
- జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు
- ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు
- జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం



హైదరాబాద్

తెలంగాణ జిల్లాలకు మహర్దశ పట్టనుంది. ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని చెప్పారు. రోడ్లు భవనాల శాఖ పురోగతిపై సీఎం రేవంత్ సంబంధింత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. - మిగతా3లో

## తప్పనిసరి నెలసరి సెలవులపై పిటిషన్

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు. జస్టిస్ సూర్యకాంత్ బెంచ్ వ్యాఖ్య
- నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే వారికి ఉద్యోగాలు ఇవ్వరు
- చట్టం చేస్తే తాము పురుషుల కంటే తక్కువ అన్న భావన మహిళల్లో కలిగే అవకాశం
- చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల కలిగే సామాజిక పరిణామాల గురించి ప్రధాన న్యాయమూర్తి ఆందోళన



# రాజ్యాంగం ప్రజల గొంతుక



రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "నిన్న పార్లమెంట్‌లో నేను ఎప్‌స్టీన్ అనే పదాన్ని ఉచ్చరించాను. దేశంలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున ఈ సమస్య ఇంధన భద్రతకు సంబంధించినదని చెప్పాను. దేశ ఇంధన భద్రతలో మోదీ రాజీపడ్డారు. ఇంధన భద్రతలో ఎందుకు రాజీ పడ్డారు? అని కేంద్రాన్ని ప్రశ్నించాను. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా హర్దీప్‌సింగ్ పూరీని నియమించారు. ఇది అమెరికాతో పడిన మొదటి రాజీ. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పూరీ పేరు ఉంది. ఆయన ఎప్‌స్టీన్‌కు ఫ్రెండ్" అని రాహుల్ పేర్కొన్నారు.

**అమెరికా కోసం మోదీ పనిచేస్తున్నారు : రాహుల్**

ప్రధాని నరేంద్ర మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదని, ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తాను నిన్న (గురువారం) పార్లమెంట్‌లో నిజాలు మాట్లాడుతుంటే, మోదీ లోక్‌సభ నుంచి వెళ్లిపోయారని అన్నారు. "కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బీజేపీ మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బీజేపీ, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు. అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే. దీన్ని ఆసరాగా చేసుకుని వాణిజ్య ఒప్పందంపై అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పార్లమెంటు నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి, మరెవరినీ సంప్రదించకుండానే కేవలం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి మోదీ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశారు" అని రాహుల్ విమర్శించారు. "దేశం పురోగతి సాధిస్తుంటే అందులో పేదలు వారి నేపథ్యంతో సంబంధం లేకుండా ఉండాలి. దేశంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను రూపొందించండి. అందులో సీఈఓలు, పెద్ద పెద్ద స్థాయిలో ఉన్నవారిని గుర్తించండి. అప్పుడు ఎన్ని కంపెనీల్లో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, ఈబీసీలు, మైనార్టీలు సీఈఓ, పెద్ద పొజిషన్‌లో ఉన్నారో చూడండి. ఒక్కరూ కూడా ఉండరు. అలాగే అదానీ గ్రూప్ సంస్థల ఉద్యోగుల జాబితాను చూడండి. అక్కడ పెద్ద హోదాలో ఒక్క దళితుడు, వెనుకబడిన తరగతి, ఎస్టీ వ్యక్తి కనిపించరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోని ప్రచారక్‌లను చూడండి. అక్కడ ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాలకు చెందిన ఒక్క ప్రచారక్ కూడా మీకు కనిపించరు. ఇదే బీజేపీ రాజకీయ విధానం."

**'సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు'**

కాన్షీరామ్ తన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని రాహుల్ గాంధీ తెలిపారు. ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే ఆయన చిత్రపటం ఇక్కడ ఎప్పటికీ ప్రదర్శితమయ్యేది కాదన్నారు. ఈ రోజు కాన్షీరామ్ స్మరించుకుందామని అన్నారు. ఆయన పోరాటం, దార్శనికత దేశ రాజకీయాలపై ప్రభావం చూపిందన్నారు. మన ఆలోచనల కోసం పోరాడకపోతే ఏమీ సాధించలేమన్నారు. "ఈ ప్రసంగం చేసే ముందు బాబాసాహెబ్ అంబేద్కర్ విద్య గురించి ఎలా మాట్లాడేవారో నేను ఆలోచిస్తున్నాను. ఆయన సంస్థాగత ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కాన్షీరామ్ రాత్రిపూట ఉత్తర్‌ప్రదేశ్ అంతటా తిరిగేవారు. ఆయన తనతో ఒక పెన్ను తీసుకెళ్లేవారు. సమాజంలోని 15 శాతం మంది కచ్చితంగా ప్రయోజనం పొందుతున్నప్పటికీ 85 శాతం మంది కూడా ప్రయోజనం పొందే విధంగా పెన్ను ఉండాలని అభిప్రాయపడేవారు. కానీ ఇప్పుడు ఏమి జరిగింది? బీజేపీ ఒక కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టింది. బీజేపీ పెన్ను నుంచి దాని క్యాప్‌ను వేరు చేసింది. క్యాప్‌ను పక్కన పెట్టింది. ఇప్పుడు పెన్ను మాత్రమే పట్టుకుని తిరుగుతుంది. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఇప్పుడు జీవించి ఉంటే కాన్షీరామ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయి ఉండేవారు" అని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

# భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దు



దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ కొరత లేదని, భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలు భయాందోళనతో వెంటవెంటనే ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్స్ చేస్తున్నారని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ తెలిపారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ప్రతిరోజు దాదాపు 55.7 లక్షల ఎల్‌పీజీ బుకింగ్సే జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య ఏకంగా 75.7 లక్షలు దాటిందన్నారు. ప్రజలు భయాందోళనతోనే భారీ బుకింగ్స్ చేస్తున్నారని ఈ గణాంకాలతో స్పష్టమవుతోందని ఆమె చెప్పారు. ఇంతగా ఆందోళన అక్కర్లేదని, దేశంలోని 25వేల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి దగ్గరా గ్యాస్ స్టాక్ పూర్తిగా అయిపోలేదని సుజాత శర్మ స్పష్టం చేశారు. శుక్రవారం దిల్లీలో కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త మీడియా సమావేశంలో ఈవివరాలను ఆమె వెల్లడించారు.

**పెట్రోలు, డీజిల్‌ల తయారీలో స్వయం సమృద్ధి**

"దేశంలోని అన్ని పెట్రోలు బంక్‌లకు పెట్రోలు, డీజిల్‌ల సప్లై నిలకడగానే జరుగుతోంది. అన్ని బంక్‌లలోనూ పెట్రోలు, డీజిల్ లభిస్తున్నాయి. పెట్రోలు, డీజిల్‌ల తయారీలో భారత్ స్వయం సమృద్ధిని సాధించింది. ఏటా 258 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును శుద్ధిచేసే కెపాసిటీ భారతదేశ రిఫైనరీలకు ఉంది. ప్రస్తుతం దేశంలోని అన్ని రిఫైనరీలు 100 శాతం కెపాసిటీతో పనిచేస్తున్నాయి. మన దేశ రిఫైనరీల దగ్గర తగినన్ని ముడి చమురు నిల్వలు కూడా ఉన్నాయి. అందుకే పెట్రోల్, డీజిల్ సప్లైలో ఇబ్బంది ఏర్పడదు. మార్చి 5 నుంచి డొమెస్టిక్ ఎల్‌పీజీ ఉత్పత్తిని 30 శాతం పెంచాం. ప్రజల ఇళ్లకు వంటగ్యాస్ సప్లైలో అవాంతరం లేకుండా చూసేందుకే ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది" అని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పేర్కొన్నారు.

**వాణిజ్య వినియోగదారులంతా పీఎన్‌జీ కనెక్షన్ తీసుకోవచ్చు!**

"అయితే ఇప్పటికీ ఎల్‌పీజీ పరిస్థితి అనేది భారత ప్రభుత్వానికి ఆందోళనకర అంశంగానే ఉంది. దేశంలోని గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) సప్లై అంతరాయం లేకుండా జరుగుతోంది. ప్రస్తుతం భారత్‌లో 1.5 కోట్ల పీఎన్‌జీ డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రధాన నగరాల్లోని సింహభాగం వాణిజ్య వినియోగదారులకు ఎల్‌పీజీ కనెక్షన్లే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితి కారణంగా వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఇబ్బందుల తొలగింపునకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ఇలాంటి వాణిజ్య వినియోగదారులంతా ప్రత్యామ్నాయంగా పీఎన్‌జీ కనెక్షన్‌ను తీసుకోవచ్చు. ఇందుకోసం వారు ఆ నగరంలోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు లేదా డీలర్లను సంప్రదించాలి. తద్వారా ఎల్‌పీజీ సప్లైలపై కొంత ఒత్తిడి తగ్గుతుంది" అని సుజాత శర్మ సూచించారు.

**రాష్ట్రాలకు అదనపు కిరోసిన్ : కమర్షియల్ సిలిండర్ల పంపిణీ బాధ్యత**

"కమర్షియల్ వంటగ్యాస్ సిలిండర్లను ప్రాధాన్యతా క్రమంలో పంపిణీ చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాం. సరైన కస్టమర్లకు సకాలంలో సిలిండర్లు చేరేందుకు అనుగుణంగా ప్రాధాన్యతా మార్గదర్శకాలను రూపొందించాలని మేం రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం. ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు అదనంగా 48వేల కిలో లీటర్ల కిరోసిన్‌ను మంజూరు చేశాం. మూడు నెలలకోసారి ప్రజలకు పంపిణీ చేసేందుకు రాష్ట్రాలకు మంజూరు చేసే 1 లక్ష కిలో లీటర్ల కిరోసిన్ కోటాకు అదనంగా ఈ కేటాయింపు జరిగింది. ఇంధన నిల్వలపై ప్రచారమయ్యే వదంతులను నమ్మొద్దని మేం ప్రజలను కోరుతున్నాం. భయంతో గ్యాస్ బుకింగ్స్ చేయొద్దు" అని సుజాత శర్మ సూచించారు.

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి



ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు.

అసోంలోని కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు.

**బోనస్ గిఫ్టుగా నాలుగు సూపర్ అబద్ధాలు**

"కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు" అని ప్రధాని మోదీ తెలిపారు.

**ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టులివీ**

అసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.

కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి.

ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి – న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి – అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.

ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.

అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.

బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు.

ఇక మార్చి 14న (శనివారం రోజు) అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.

**వచ్చే నెలలోనే అసోం ఎన్నికలు?**

వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారి అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

## దేశరైతులను ఆదుకోవడానికి కృషి

ఎన్డీఏ ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి, దేశం స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ మరోసారి దేశం పట్ల తమ నిబద్ధత లోపాన్ని ప్రదర్శించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. యుద్ధాల వల్ల తలెత్తిన సంక్షోభ సమయాల్లో కూడా కాంగ్రెస్ తప్పుడు సమాచారాన్ని, అసత్యాలను ప్రచారం చేయడానికే పరిమితమైందని విమర్శించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. అక్కడి నుంచే దేశవ్యాప్తంగా అర్హులైన 9.3 కోట్లకు పైగా రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 22వ విడత నిధులను విడుదల చేశారు. "మేము టీ తోట కార్మికులకు భూమి పట్టాలు ఇచ్చాం. వారికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని అంతం చేశాం. వాస్తవానికి టీ తోట కార్మికులకు భూమి పట్టాలు ఇవ్వడం ద్వారా నా రుణాన్ని తీర్చుకుంటున్నాను. మీరు ఉత్పత్తి చేసిన టీని అమ్మడం ద్వారా నేను ఈ స్థానానికి చేరుకున్నాను. నాకు మీ ఆశీస్సులు ఉన్నాయి. అసోం అన్ని ఈశాన్య రాష్ట్రాలకు ఒక మోడల్‌గా మారుతోంది. గత పదేళ్లలో అసోంలో జరిగిన అభివృద్ధిని చూసి బంగాల్ ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీజేపీ సర్కార్‌ను కోరుకుంటున్నారు. "

**వారి కోసం కాంగ్రెస్ ఏం చేయలేదు : మోదీ**

టీ తోట కార్మికులకు భూమి హక్కులను అందించడం ద్వారా అసోంలోని ఎన్డీఏ సర్కార్ ఆ సమాజానికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని అంతం చేస్తోందని మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అసోంలో అధికారంలో ఉన్నప్పుడు టీ తోట కార్మికులను ఎప్పుడూ పట్టించుకోలేదని ఆరోపించారు. భారత్‌ను దశాబ్దాలుగా విదేశాలపై ఆధారపడేలా కాంగ్రెస్ చేసిందని, కానీ ఎన్డీఏ ప్రభుత్వం దానిని క్రమంగా మార్చిందని వెల్లడించారు.

## తప్పనిసరి నెలసరి సెలవులపై పిటిషన్



మహిళల నెలసరి సెలవులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళా విద్యార్థులు, కార్మికులకు నెలసరి సెలవులు కల్పించే దేశవ్యాప్త విధానాన్ని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) స్వీకరించడానికి అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. రుతుక్రమ సెలవులు తప్పనిసరి చేస్తే ఎవరూ వారికి ఉద్యోగాలు ఇవ్వరని అభిప్రాయపడింది. అలాంటి చట్టం చేస్తే తాము పురుషుల కంటే తక్కువ అన్న భావన మహిళల్లో కలిగే అవకాశం ఉందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ బెంచ్ అభిప్రాయపడింది. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదంటూ పిటిషన్ దారును ఉద్దేశించి వ్యాఖ్యానించింది.

**ఆ చట్టాన్ని తీసుకువస్తే, ఎవరూ వారిని నియమించుకోరు!**

విచారణ సందర్భంగా, చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల కలిగే సామాజిక పరిణామాల గురించి ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విషయంలో మహిళల్లో నెలసరి అంశంపై అవగాహన కల్పించడం వేరని, దానిని సెన్సేషన్ చేయడం వేరని బెంచ్? పేర్కొంది. ఒకవేళ నెలసరి సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువస్తే, ఆ మరుక్షణమే ఎవరూ వారిని నియమించుకోరని తెలిపింది. ఈ సందర్భంగా, పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎం ఆర్ షంషద్, కొన్ని రాష్ట్రాలు, సంస్థలు ఇప్పటికే రుతుక్రమ సెలవులను కల్పించడానికి చర్యలు తీసుకున్నాయని ఆయన ఎత్తి చూపారు. అందుకు కేరళలో తీసుకున్న చర్యలను ఉదహరించారు. అక్కడ పాఠశాలల్లో సడలింపులు ప్రవేశపెట్టారని, అనేక ప్రైవేట్ కంపెనీలు స్వచ్ఛందంగా ఉద్యోగులకు సెలవులను అందించాయని ఆయన గుర్తుచేశారు.

**దీనికి బెంచ్ ఏమందంటే?**

ఈ విషయంపై బెంచ్ స్పందిస్తూ, ఆ నిర్ణయాలన్నీ వారు స్వచ్ఛందంగా తీసుకున్నారని సీజేఐ అన్నారు. కానీ చట్టం ద్వారా అలాంటి నిబంధనలను తప్పనిసరి చేయవద్దని హెచ్చరించారు. "సెలవులను వారు స్వచ్ఛందంగా ఇవ్వడం చాలా బాగుంది. చట్టంలో ఇది తప్పనిసరి అని మీరు చెప్పిన వెంటనే, ఎవరూ వారికి ఉద్యోగాలు ఇవ్వరు. న్యాయవ్యవస్థలో లేదా ప్రభుత్వ ఉద్యోగాల్లో వారిని ఎవరూ తీసుకోరు. ఫలితంగా వారి కెరీర్ ముగుస్తుంది" అని సీజేఐ వ్యాఖ్యానించారు. మహిళల పనిప్రదేశాల్లో అవగాహనలపై, అలాగే వృత్తిపరమైన వృద్ధిపై ఇటువంటి చర్యల సంభావ్య ప్రభావాన్ని కూడా ధర్మాసనం హైలైట్ చేసింది.

**గతంలో కూడా ఇలాంటి పిటిషనే ఒకటి!**

గతంలో కూడా మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో రెండు రాష్ట్రాలు మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నాయని, మిగతా రాష్ట్రాల్లోనూ దీన్ని పాటించేలా ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషన్?ను సుప్రీంకోర్టు నిరాకరించింది. విధానపరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్?ను కొట్టివేసింది. నెలసరి సెలవులు మంచి నిర్ణయమే, అయినప్పటికీ దానివల్ల మహిళలు ఉద్యోగ అవకాశాలకు దూరం కావొచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. అప్పట్లో భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. మహిళలకు నెలసరి సెలవులు ఇస్తే వారు మరింత ఎక్కువగా ఉద్యోగాల్లో చేరేందుకు ప్రోత్సహించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. సెలవులను తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంది. ఫలితంగా, మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు కూడా తగ్గొచ్చని తెలిపింది. అయితే, అలాంటి పరిస్థితులను తాము కోరుకోవట్లేదని ధర్మాసనం పేర్కొంది. మహిళల ప్రయోజనాల కోసం కొన్నిసార్లు మనం చేసే ప్రయత్నాలు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారవచ్చునని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అభిశంసనకు ఉభయ సభల్లో విపక్షాల నోటీసులు

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడానికి ప్రతిపక్షాలు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చాయి. శుక్రవారం లోక్?సభ, రాజ్యసభకు అభిశంసన తీర్మాన నోటీసులు అందజేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. 130 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ సభ్యులు నోటీసుపై సంతకం చేసినట్లు పేర్కొన్నారు. అయితే సీఈసీపై పార్లమెంటులో నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారి. జ్ఞానేశ్‌కుమార్‌పై పక్షపాతం, ఓట్ల తొలగింపు, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం వంటి 7 అభియోగాలను విపక్షాలు మోపాయి. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల ఎంపీలు నోటీసుపై సంతకం చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే కూటమిలో లేని ఆప్?, కొంతమంది స్వతంత్ర ఎంపీలు కూడా సంతకం చేశారని పేర్కొన్నాయి. మరికొంత మంది సంతకం చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారని చెప్పాయి. సీఈసీ జ్ఞానేశ కుమార్?పై మొత్తం ఏడు అభియోగాలను నమోదు చేశారు విపక్షాల ఎంపీలు. వాటిలో ముఖ్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. విధి నిర్వహణలో పక్షపాత ధోరణి ఎన్నికల్లో అవకతవకలపై దర్యాప్తునకు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడటం, పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వంటివి ఆరోపణలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించడానికి అనుసరించే ప్రక్రియ ఉంటుంది.

# గ్యాస్ బుకింగ్‌లో అవస్థలు

-మొదటిపేజీ తరువాయి




కొన్ని పని చేయడం లేదు. దీంతో వినియోగదారులు నేరుగా ఏజెన్సీల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఒక్కసారిగా రద్దీ పెరగడం, బుకింగ్ సిస్టమ్ నెమ్మదించడం వల్ల సమస్య ఏర్పడిందని ఏజెన్సీల నిర్వాహకులు తెలుపుతున్నారు.

పరిస్థితి చేయి దాటితే బ్లాక్‌లో తీసుకునే ప్రయత్నం : డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ సాధారణ రోజుల్లో బుక్? చేస్తే ఒకటి, రెండు రోజుల్లో సిలిండర్ వస్తుంది. కానీ ఇప్పుడు వారంపైగా పడుతోందని వినియోగదారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో భారత్, ఇండేన్, హెచ్‌పీ మూడు ఏజెన్సీలు గ్యాస్ సరఫరా చేస్తున్నాయి. 350 నుంచి 400 మంది డీలర్లు ఉండగా, అందులో 30 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. సింగిల్? సిలిండర్? మాత్రమే ఉండి, అది అయిపోయిన వారంతా బుక్ చేసుకునేందుకు ఏజెన్సీల వద్ద లైన్లు కడుతున్నారు. నేరుగా ఫోన్?లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తే స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. వాణిజ్య కేటగిరి సరఫరా ఆగిపోవడంతో డొమెస్టిక్ సిలిండర్లను టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు బ్లాక్?లో తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ఎల్‌పీజీ కొరత లేదు**

రంగారెడ్డి జిల్లాలో ఎల్‌పీజీకి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్?లో ఎల్?పీజీ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సిలిండర్ పంపిణీకి ఎటువంటి అంతరాయాలు లేకుండా యథావిధిగా కొనసాగడానికి తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు. వినియోగదారులు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసుకోవద్దని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి వనజాతరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రత్యామ్నాయాలున్నాయ్? :**

గ్యాస్ స్టవ్‌కు ప్రత్యామ్నాయంగా వంటకు మోడ్రన్ ఇండక్షన్ స్టవ్, ఎలక్ట్రిక్ కుక్కర్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో చేస్తే తక్కువ ఖర్చుతో, ఎలాంటి హాని కలగకుండా వంట చేసుకోవచ్చు.

అంతేకాదు సోలార్, బయోగ్యాస్, బొగ్గు కట్టెల పొయ్యి వినియోగించవచ్చు.

పశువుల వ్యర్థాల నుంచి గోబర్ గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. దీనిని గృహాలు, వ్యవసాయ, పరిశ్రమల అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.

ఇండక్షన్ స్టవ్ విద్యుత్తుతో పని చేస్తుంది. వంటను స్పీడ్?గా రెడీ చేసుకోవచ్చు. అలా చేస్తే గ్యాస్? కంటే తక్కువ ఖర్చవుతుంది.

ఎలక్ట్రిక్ కుక్కర్, హాట్ ప్లేట్‌తో అన్నం, కూరలు వంటివి ఈజీగా కుక్? చేసుకోవచ్చు.

ఇన్‌ఫ్రారెడ్ స్టవ్ విద్యుత్తుతో పని చేస్తుంది.

బయట గ్యాస్ సిలిండర్లు లేవు - ఇలా ఆదా చేయండి :

గ్యాస్ వెలిగించిన తర్వాత గిన్నెలు, కావాల్సిన పదార్థాల కోసం వెతకడంతో మంట మండుతుండటం వల్ల గ్యాస్ వృథా అవుతుంది.

ఉడికించే పదార్థాలకు ప్రెషర్? కుక్కర్లను ఉపయోగిస్తే దాదాపు గ్యాస్? పొదుపు చేయొచ్చు.


పెద్ద పాత్రలు, మూతలేని పాత్రలు ఉపయోగిస్తే చేసే దానికంటే ఎక్కువ వేడి చేయాలి. అంటే గంటకు 7.2 ?శాతం గ్యాస్?ని కోల్పోతాం. దానిపై మూతలు పెట్టడంతో 1.45 శాతం ఆదా అవుతుంది.

తక్కువ ఆహార పదార్థాలు వండటానికి చిన్న బర్నల్? వినియోగిస్తే 10 శాతం గ్యాస్? తక్కువ వినియోగమవుతుంది.

తక్కువ లోతు ఉన్న వంట పాత్రలు వాడితే తొందరగా వేడి బయటకు వెళ్లి గ్యాస్? వృథా అవుతుంది. లోతుగా ఉన్నవాటిని వాడితే అది వేడి అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాని వల్ల అధిక గ్యాస్? వినియోగం అవుతుంది. ఇకపై వంట చేసే ముందు బియ్యం, పప్పులు లాంటివి అరగంట ముందే నానబెడితే గ్యాస్? ఆదా అవుతుంది.

# సిలిండర్ డెలివరీపై కఠిన నియమం





**హైదరాబాద్:** గ్యాస్ సిలిండర్ల డెలివరీకి 'ఓటీపీ' సమస్యగా మారింది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నది. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే గ్యాస్ సిలిండర్ల డెలివరీలో తప్పనిసరిగా ఓటీపీ నమోదు చేసుకోవాలని, ఓటీపీ నెంబర్ చెబితేనే సిలిండర్ జారీ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే గత పది రోజుల నుంచి డెలివరీ బాయ్స్ గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న సమయంలో ఓటీపీ నెంబర్ తప్పనిసరిగా నమోదు చేసుకుంటున్నారు. ఓటీపీ నమోదులో చాలా సమయం తీసుకుంటున్నదని డెలివరీ బాయ్స్‌తో పాటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్--7 పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో 81 రేషన్ దుకాణాలు ఉండగా, 9 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,57,221 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ఒక్కో ఏజెన్సీ రోజూ 500--600 వరకు మాత్రమే సిలిండర్లు పంపిణీ చేస్తుంది. రెండు వారాల క్రితం ఒక్కో గ్యాస్ ఏజెన్సీ 700--800 వరకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేది. రెండు వారాల క్రితం వరకు ఓటీపీ అడగకుండానే బుకింగ్ చేసుకున్న వినియోగదారుడికి సిలిండర్ పంపిణీ చేసేవారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సిలిండర్లు పక్కదారి పట్టకుండా డెలివరీ సమయంలో పకడ్బందీగా సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

**ఓటీపీకి చాలా సమయం..**

గ్యాస్ బుకింగ్ చేసుకున్న సమయంలో ఆ గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరుపై ఉంటే వారి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. రెండు మూడు వారాల తర్వాత సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీబాయ్ బుకింగ్ సమయంలో వచ్చిన ఓటీపీని అడుగుతాడు. ఆ ఇంటి యజమానురాలు కనెక్షన్ ఎవరి పేరుపై ఉందో వారికి ఫోన్లు చేసి ఓటీపీ నెంబర్ తీసుకుని మళ్లీ డెలివరీ బాయ్‌కు చెప్పగానే తాజా బిల్లుతో పాటు వచ్చే ఓటీపీ, బుకింగ్ సమయంలో వచి?చన ఓటీపీ సరిపోవాల్సి ఉంటుంది. తేడా వస్తే సమయం అంతా వృథా అవుతుందని డెలివరీ బాయ్స్ వాపోతున్నారు. ఒక్కో సిలిండర్ పంపిణీకి గతంలో ఐదు నిమిషాలు పడితే, ఇప్పుడు పావుగంట సమయం తీసుకుంటున్నది. దీని వల్లనే సిలిండర్ల పంపిణీలో జాప్యం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు.

**ఆందోళన వద్దు.. కొరత లేదు**

కావలసినన్ని సిలిండర్లు ఉన్నాయి. వచ్చిన చిక్కల్లా ఓటీపీతోనే. ప్రతి సిలిండర్ డెలివరీలోనూ ఓటీపీ నమోదు చేసుకుని ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే చాలా సమయం తీసుకుంటుంది. మా ఏజెన్సీ పరిధిలో రెండు వారాల క్రితం వరకు రోజుకు 800 సిలిండర్లు పంపిణీ చేసేవాళ్లం. ఇప్పుడు 600 మాత్రమే చేయగలుగుతున్నాం. డెలివరీ బాయ్స్ సైతం సిలిండర్లను అనుకున్న స్థాయిలో ఇవ్వలేకపోతున్నారు. ప్రస్తుతం మా ఏజెన్సీ పరిధిలో బుకింగ్ చేసుకున్న రెండు రోజుల్లోనే గ్యాస్ సరఫరా అవుతోంది. గృహావసరాల డొమెస్టిక్ సిలిండర్ల గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కమర్షియల్ సిలిండర్ల కొరత మాత్రం ఉంది. బుకింగ్ సమయంలో వచ్చే ఓటీపీని కనెక్షన్ ఉన్న వినియోగదారుడు తప్పనిసరిగా భద్రపరచుకోవాలి. బుకింగ్ సమయంలో వచ్చే ఓటీపీకి, డెలివరీ సమయంలో వచ్చే ఓటీపీకి ట్యాలీ కావలసి ఉంటుంది. త్వరత్వరగా ఓటీపీ నెంబర్ చెబితే అంతే త్వరగా సిలిండర్ల పంపిణీ కూడా జరుగుతుంది. చాలామంది సిలిండర్లు దొరకవేమోనని ఆందోళన చెందుతున్నారు. అది సరికాదు. గ్యాస్ గోడౌన్లలో కావలసినన్నీ సిలిండర్లు స్టాక్‌లో ఉన్నాయి.

**అక్రమార్కులపై కొనసాగుతున్న దాడులు**

బంజారాహిల్స్: గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ సెంటర్లతో పాటు వాణిజ్య సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్న ప్రాంతాలపై పౌర సరఫరాల శాఖ అధికారులు, టాస్?క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు కొనసాగిస్తున్నారు. గురువారం జూబ్లీహిల్స్ జోన్ టాస్?క్‌ఫోర్స్ ఎస్ఐ రవిరాజ్, రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్--7 జూనియర్ ఎంక్వైరీ ఇన్‌స్పెక్టర్లు టి.సాయికిరణ్, రాచకొండ సాహిత్‌సాగర్ తదితరులు వెంకటగిరిలో దాడులు చేశారు. అచిన్‌తల్వార్ బాలాజీ అనే వ్యక్తి డొమెస్టిక్ సిలిండర్ల నుంచి మినీ సిలిండర్లకు గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నట్లుగా సమాచారం రావడంతో దాడులు చేశారు. ఇందులో భాగంగా రెండు డొమెస్టిక్ సిలిండర్లతో పాటు 35 మినీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీపై కేసు నమోదు చేశారు. అలాగే అమీర్‌పేట, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో రేషనింగ్ అధికారులు దాడులు చేసి అక్రమంగా వినియోగిస్తున్న 11 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. నిరంతరం ఈ దాడులు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

# రాష్ట్రంలో 810 ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది

**అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ఉపేక్షించబోము**

**మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ :** రాష్ట్రంలో 810 ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం, అక్రమంగా మళ్లీంచడం, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని ఆయన హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకమారు ఎల్‌పిజి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని, ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు..

-మొదటిపేజీ తరువాయి

మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు. మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

## ఆర్టీసీలో సమ్మె సైరన్

-మొదటిపేజీ తరువాయి

కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే జరపాలని యాజమాన్యానికి కోరారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం ఉంటుందని జేఏసీ నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని తేల్చి చెప్పారు. నోటీసులు ఇచ్చేందుకు ముందు ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు హైదరాబాద్?లోని బస్?భవన్? వద్దకు చేరుకుని శాంతియుత నిరసనకు దిగారు. అనంతరం పలువురు నాయకులు ఉపన్యాసాలు ఇచ్చి ఆర్టీసీ ఈడీకి నోటీసులు అందజేశారు. ఈవీ బస్సుల్లో ఆర్టీసీ ఉద్యోగులే పనిచేయాలని, వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని ధర్నా చేశారు.

**వెనక్కి వెళ్లే ప్రసక్తి లేదు**

ఆర్టీసీని ఎందుకు ప్రభుత్వంలో విలీనం చేయడం లేదని, అన్యాయంగా యూనియన్లను సర్కారు రోడ్డెక్కించిందని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి వెళ్లే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కాంగటటగ్రే పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నేతలు తేల్చిచెప్పారు. గవర్నర్? వద్ద ఉన్న ఆర్టీసీ విలీన బిల్లుకు ఆమోదముద్ర ఎందుకు వేయించడం లేదని ప్రశ్నించారు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రభుత్వంతోనే మా యుద్ధం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లు తమకిచ్చిన హామీల కోసం ఎదురు చూశామని ఇక తమకు ఓపిక నశించిపోయిందని కార్మిక సంఘాల జేఏసీ వ్యాఖ్యానించింది. ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు భరోసా లేదా? తాము ఎలా బతకాలి? అని వాపోయారు. తమకు బడ్జెట్?లో ప్రత్యేకంగా వాటా కావాలన్నారు. అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌ను ఎందుకు మార్చరని ప్రశ్నించిన ఆర్టీసీ జేఏసీ నేతలు, యాజమాన్యానికి తనకు ఎలాంటి యుద్ధం లేదని చెప్పారు. కేవలం ప్రభుత్వంతోనే యుద్ధమన్నారు.

**కార్మిక సమాజానికి వ్యతిరేక ప్రభుత్వం**

తాము ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని సభలు పెట్టినా ఈ ప్రభుత్వం చర్చలకు కూడా పిలువలేదని, అసలు రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా? అని ఆర్టీసీ జేఏసీ ప్రశ్నించింది. గత ప్రభుత్వం చేయాల్సిన క్రతువు చేసిందని ఈ ప్రభుత్వం మిగిలింది ఎందుకు చేయలేదని ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపై ఇప్పుడు ఏం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక సమాజానికి వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. ఆర్టీసీ హక్కులను కాపాడుతామని, ఆర్టీసీతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం ముందుకు పోలేదని హెచ్చరించారు. మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, మరి ఆర్టీసీని ఎందుకు ప్రభుత్వంలో విలీనం చేసుకోవడం లేదని జేఏసీ నేతలు ప్రశ్నించారు. తమ డిమాండ్ల సాధన కోసం అవసరమైతే అసెంబ్లీ ముందు ఆందోళనకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు.

## తెలంగాణ జిల్లాలకు మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ - విజయవాడ ఎక్స్ప్రెస్ వే నుంచి నాగార్జునసాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపైనా అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక ప్రభుత్వ శాఖలు ఇకనుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ విధానాలకు స్వస్తి చెప్పాలని, మొత్తం ఆన్లైన్లోనే కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు. రవాణా శాఖపై మంత్రి పొన్నంతో కలిసి సమీక్ష నిర్వహించిన సీఎం.. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదన్నారు. వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని, ప్రజల్లో చైతన్యం తేవడానికి షార్ట్ ఫిల్ము ప్రదర్శించాలని సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్కు స్థలం కేటాయిస్తామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అదికారులను ఆదేశించారు.

## సభ్యుల ప్రశ్నలకు సమాదానాలు రేపటిలోగా పంపించాలి..

**అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికారులకు సీఎస్ ఆదేశాలు**

**హైదరాబాద్ :** ఈనెల 16 వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాదానాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు.

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

# ప్రభుత్వేతర పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలి

## విద్యా హక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి: విద్యా కమిషన్ అధ్యక్షుడికి వినతి




**వాస్తవ నేస్తం,హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వేతర పాఠశాలల్లో పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని 'కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ వాయిస్' సంస్థ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగంలోని 21-ఏ అధికరణ ప్రకారం.. ఆరు నుంచి పద్నాలుగేళ్ల వయసున్న ప్రతి చిన్నారికి ఉచిత, నిర్బంధ విద్యను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో గుర్తుచేశారు. ఈ చట్టంలోని నిబంధన 12(1)(సి) ప్రకారం.. ప్రభుత్వ ఆర్థిక సాయం పొందని యాజమాన్యాలు సైతం తమ ప్రాథమిక ప్రవేశ దశలో కనీసం 25 శాతం సీట్లను ఆర్థికంగా బలహీన, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు కేటాయించి ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**అమలుకాని నిబంధనలు.. దూరమవుతున్న విద్య**

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈ ఉచిత ప్రవేశాల నిబంధన కాగితాలకే పరిమితమవుతోందని, ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. పర్యవేక్షణ లోపం వల్ల నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎందరో చిన్నారులు నాణ్యమైన విద్యకు దూరమవుతూ అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ విద్యా కమిషన్ అధ్యక్షుడు ఆకునూరి మురళికి సంస్థ తరపున ప్రతినిధులు ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈ చట్ట నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, 25 శాతం ఉచిత సీట్ల భర్తీ కోసం అంతర్జాలం ద్వారా పారదర్శకంగా ప్రవేశాల విధానాన్ని తీసుకురావాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. రాబోయే విద్యా సంవత్సరానికల్లా ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలయ్యేలా తమ సంస్థ తరపున నిరంతరం కృషి చేస్తామని సభ్యులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నరేష్ బాబు, మాధవ రెడ్డి, వెంకటేష్, మల్లేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

**34 కేంద్రాల్లో ఏర్పాట్లు పరీక్ష రాసే విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలి**

**హాజరుకానున్న విద్యార్థుల సంఖ్య 7,317**



**రాజన్న సిరిసిల్ల :** 14వ తేదీ శనివారం నుంచి పదో తరగతి పరీక్షలు మొదలు కానున్నాయి. జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిర్ణీత పరీక్ష సమయం తరువాత ఐదు నిమిషాలు వరకు విద్యార్థులను అనుమతిస్తారు.

**34 కేంద్రాల్లో పరీక్షలు..**

పదో తరగతి పరీక్షలకు మొత్తం 7317 మంది విద్యార్థులు హాజరుకానుండగా, బాలురు 3511, బాలికలు 3806 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో డెస్క్ లు, తాగునీరు, టాయిలెట్స్, ట్యూబ్ లైట్స్ ఇతర సౌకర్యాలు కల్పించారు. జిల్లాలో 34 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కుసుమ రామయ్య జడ్పీ హైస్కూల్ (బాయ్స్) సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ వెంకంపేట సిరిసిల్ల, సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం పత్తిపాక వీధి సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ అంబేద్కర్ నగర్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (బాలికల) ఏ వింగ్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (బాలికల) బీ వింగ్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ నెహ్రూనగర్, ప్రభుత్వ హైస్కూల్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (వొకేషనల్) తంగళ్ళపల్లి, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ చందుర్తి, జడ్పీ హైస్కూల్ రుద్రంగి, జడ్పీ హైస్కూల్ (వొకేషనల్) ఇల్లంతకుంట, కేరళ మోడల్ స్కూల్ ఇల్లంతకుంట, జడ్పీ హైస్కూల్ గాలిపెల్లి, జడ్పీ హైస్కూల్ జిల్లెల, జడ్పీ హైస్కూల్ లింగన్నపేట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ వేములవాడ, గౌతం హైస్కూల్ వేములవాడ, జడ్పీ హైస్కూల్ (బాలికల) వేములవాడ, కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ వేములవాడ, హంసిని డిజి హైస్కూల్ వేములవాడ, జడ్పీ హైస్కూల్ (బాయ్స్) గంభీరావుపేట్ (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ (బాలికల) గంభీరావుపేట్, జడ్పీ హైస్కూల్(బాయ్స్) ముస్తాబాద్, జడ్పీ హైస్కూల్(బాలికల) ముస్తాబాద్ (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డిపేట ఏ వింగ్, జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డిపేట బీ వింగ్, జడ్పీ హైస్కూల్ వీర్నపల్లి (వొకేషనల్), టీఎస్ మోడల్ స్కూల్ కోనరావుపేట, సిరిసిల్ల (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ ధర్మారం, జడ్పీ హైస్కూల్ బోయినపల్లి(వొకేషనల్), జడ్పీ హైస్కూల్ విలాసాగర్ ల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.×

**144 సెక్షన్ అమలు..**

పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు. × పర్యవేక్షణకు బృందాలు..పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెం డెంట్లు 34, డిపార్ట్ మెంటల్ అధికారులు 34, సిట్టింగ్ స్క్వాడ్ 34, ఫ్లయింగ్ స్క్వాడ్ రెండు టీంలు, అడిషనల్ డిపార్టుమెంటు ఆఫీసర్స్, స్టేట్ లెవెల్ అబ్జర్వర్స్, కస్టోడియన్ అధికారులను నియమించారు.

**ప్రశాంతంగా పరీక్షలు రాయాలి**

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్. ఎలాంటి ఒత్తిడి లేకుండా.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. పరీక్షల మధ్య విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా సమయానికంటే ముందే చేరుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్, తెలిపారు

# తిమ్మాపూర్ మండలంలో చైన్ స్నాచింగ్ కేసు

## ఐదుగురు నిందితుల అరెస్ట్







**కరీంనగర్ :** తిమ్మాపూర్ మండల పరిధిలో సంచలనం సృష్టించిన ఆర్ఎంపి వైద్యుడిపై దాడి, చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ నేరానికి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి కారు, బంగారు గొలుసు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు.? వివరాలు:?గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన తమ్మనవేని కొమురయ్య ఆర్ఎంపిగా పనిచేస్తున్నారు. నిందితుల్లో నలుగురు స్థానిక ప్రాంతానికి చెందిన వారు కాగా, ఒకరు పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు. వీళ్లు జల్సాలకు అలవాటు పడి, గతంలో అద్దెకు తీసుకున్న ఎర్టిగా కారు డ్యామేజీకి సంబంధించి యజమానికి చెల్లించాల్సిన 40,000 కోసం దొంగతనానికి పథకం వేశారు. ఒంటరిగా తిరిగే కొమురయ్య మెడలోని బంగారు గొలుసును లక్ష్యంగా చేసుకుని, మార్చి 11న కరీంనగర్‌లో ఒక స్విఫ్ట్ డిజైర్ కారును అద్దెకు తీసుకుని మాటు వేశారు.?ఘటన వివరాలు:?మార్చి 11న రాత్రి 11:30 గంటల సమయంలో కొమురయ్య నేదునూర్ నుండి తన మోటార్ సైకిల్‌పై వస్తుండగా,నిందితులు కారులో వెంబడించారు. నేదునూర్ శివారులోని మామిడి తోట వద్ద అతడిని అడ్డుకుని, కళ్ళలో కారం చల్లి భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం ఆయన మెడలోని తులం బంగారు గొలుసు మరియు 1,000 నగదు దోచుకుని పరారయ్యారు.?పోలీసుల దర్యాప్తు-అరెస్ట్:?ఈ ఘటనపై సిపి ఆదేశాల మేరకు ఏసిపి కరీంనగర్ రూరల్ పర్యవేక్షణలో తిమ్మాపూర్ సిఐ. మరియు సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఇందిరానగర్ క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారును ఆపి తనిఖీ చేయగా ఐదుగురు నిందితులు పట్టుబడ్డారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించడమే కాకుండా, కోహెడ మండలంలో ఒక కరెంటు మోటారు దొంగతనం చేసినట్లు కూడా ఒప్పుకున్నారు. అరెస్టయిన నిందితులు:పెనుగొండ అబినైజర్ గుండ్లపల్లి,పంబాల నాగరాజు గుండ్లపల్లి,గుజ్జేటి మధువర్ధన్ బొట్లవనపర్తి- పెద్దపల్లి జిల్లా,మాచర్ల రామ్ చరణ్ గౌడ్ నుస్తులాపూర్, మరో బాల నిందితుడు,స్వాధీనం చేసుకున్న వస్తువులు: నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు యా08-ఇఈ-3389?ఒక తులం బంగారు గొలుసు విలువ సుమారు రూ. 1,00,000?4 మొబైల్ ఫోన్లు 1,000 నగదు ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఏసిపి కరీంనగర్ రూరల్ విజయ కుమార్, తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్, ఎల్.ఎం.డి. కాలనీ ఎస్.ఐ అన్వర్, మరియు కానిస్టేబుళ్లు రాఘవ, ఆకాష్, అనిల్ కుమార్‌లను సిపి ప్రత్యేకంగా అభినందించారు.

## పంటల పెట్టుబడిలో జాగ్రత్త పడాలి



**వాస్తవ నేస్తం,భీంపూర్ :** రైతులు వానాకాలం, యాసంగి పంటల విషయంలో పెట్టుబడులు పొదుపుగా చేయాలని, పురుగుమందులు, ఎరువులను వ్యవసాయాధికారుల సూచనలతో మితంగా వాడాలని ఆదిలాబాద్ వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. భీంపూర్ మండలం నిపాని గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం కింద రైతులకు అవగాహన కల్పించారు. పశువుల పేడలాంటివి ఎరువులుగా వాడాలని గుర్తుచేశారు. సేంద్రియ వ్యవసాయం గురించి వివరించారు. ఈ పథకం కింద ఉచితంగా పురుగుమందులు పంపిణీ చేశారు. శనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గోపీకిషన్, ఏవో శ్రీనివాస్ రెడ్డి,ఏఈవోలు శంకర్,సాయి ప్రసాద్, వికాల్, సర్పంచ్ మల్లెల గంగమ్మ స్వామి, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

## 'తుడుం దెబ్బ' పేరుతో అక్రమ వసూళ్లు.. నలుగురి అరెస్ట్

**తీసుకున్న రుణాలు ఎగ్గొట్టి.. తిరిగి వసూళ్లకు పాల్పడిన వైనం**

**వివరాలు వెల్లడించిన టూ టౌన్ సీఐ నాగరాజు**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ :** తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించకపోగా, ఆదివాసీ సంఘాల పేరుతో కోఆపరేటివ్ సొసైటీ నిర్వాహకులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ టూ టౌన్ సీఐ కె. నాగరాజు తెలిపారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కొండూరి రాకేందర్ ఆర్కే కోఆపరేటివ్ సొసైటీకి చైర్మన్‌గా, రాగం రమేష్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం సొసైటీ ద్వారా రూ.25 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలను అందించేవారు. అయితే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, నష్టాల కారణంగా 2024 ఏప్రిల్ నెలలో ఈ సొసైటీని మూసివేశారు. సొసైటీ నడుస్తున్న సమయంలో ఇంద్రవెల్లి మండలం దొడంద గ్రామానికి చెందిన తుమ్రం ప్రభాత్ రావు, బజార్‌హత్నూర్ మండలం రెంజర్ గ్రామానికి చెందిన దుర్వ సుభాష్ తలా సుమారు లక్ష రూపాయల మేర రుణాలు తీసుకున్నారు. సొసైటీ మూతపడటాన్ని ఆసరాగా చేసుకున్న వీరు తీసుకున్న అప్పును తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు పథకం పన్నారు.వీరు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఆదివాసీ స్టూడెంట్ యూనియన్ జిల్లా సెక్రటరీ సలాం వరుణ్ అలియాస్ అరుణ్ కుమార్, వెట్టి మనోజ్‌లతో కలిసి తాము ఆదివాసీ నాయకులమని పరిచయం చేసుకున్నారు. అప్పటికే అప్పుల బాధలో ఉన్న సొసైటీ నిర్వాహకులను 'తుడుం దెబ్బ' పేరుతో బెదిరించడం ప్రారంభించారు. తమకు అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే ధర్నాలు చేస్తామని బెదిరించి రెండు మూడు దఫాలుగా రూ. 20 వేల చొప్పున వసూలు చేశారు. నిందితుల వేధింపులు తాళలేక బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన టూ టౌన్ పోలీసులు నలుగురు నిందితులను గుర్తించారు. వీరిలో వెట్టి మనోజ్, తుమ్రం ప్రభాత్ రావు, దుర్వ సుభాష్‌లను గురువారం అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుల్లో ఒకరైన సలాం వరుణ్ ఇదివరకే వేరే కేసులో జైలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో ఇలాంటి బెదిరింపులు, అక్రమ వసూళ్లకు ఎవరైనా పాల్పడితే ప్రజలు ఏమాత్రం భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో కానీ, జిల్లా పోలీసులకు కానీ నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సీఐ నాగరాజు ఈ సందర్భంగా సూచించారు.

## మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు చేపలు

**హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు చేపలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అనేక మంది విద్యార్థులకు కడుపు నిండుతుంది. ఈ నేపథ్యంలోనే వారికి పౌష్టికాహారాన్ని కూడా అందించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. చేపల వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందించవచ్చని, ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని చేపల చెరువుల నుంచి ఉత్పత్తి అయ్యే చేపలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తే అటు మత్యకారులకు ఇటు విద్యార్థులకు మేలు జరుగుతుందని మత్య, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆలోచనగా తెలుస్తోంది. ఇదే అంశాన్ని మంత్రి వాకిటి శ్రీహరి సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిసింది. ఇప్పటికే విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంపై సిఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పిల్లలు కడుపునిండా పౌష్టికాహారం తినేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. అయితే, విద్యార్థులకు చికెన్ స్థానంలో చేపలు పెడితే మరింత పోషకాహారం లభిస్తుందని ఈ నేపథ్యంలోనే వారానికోసారి చికెన్ స్థానంలో ఫిష్ అందించాలని సిఎం రేవంత్‌రెడ్డి కూడా నిర్ణయించినట్టుగా తెలిసింది.

## యుద్ధం తెచ్చిన యూరియ కరువు

**హైదరాబాద్ :** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత వ్యవసాయ రంగాన్ని కలవరపెడుతున్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సరఫరాలోనే కాకుండా, ఎరువుల తయారీలో కీలకమైన ద్రవరూప సహజ వాయువు సరఫరాలోనూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత్ తన యూరియా ఉత్పత్తికి అవసరమైన ఎల్ఎన్‌జీని ప్రధానంగా ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం కారణంగా ఈ సరఫరా గొలుసు దెబ్బతినడంతో దేశీయంగా యూరియా తయారీ సంక్షోభంలో పడిందిఎరువుల తయారీకి అవసరమైన గ్యాస్ నిల్వలు భారత్ వద్ద ప్రస్తుతం 70 శాతానికి పడిపోయాయి. ఈ ప్రభావంతో ప్రముఖ ఎరువుల సంస్థ ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ ఇప్పటికే తన కొన్ని ప్లాంట్లను తాత్కాలికంగా మూసివేసింది. మరికొన్ని కేంద్రాల్లో ఉత్పత్తిని భారీగా తగ్గించింది. ముడిసరకు కొరత ఇలాగే కొనసాగితే మరిన్ని కంపెనీలు ఇదే బాటలో నడిచే ప్రమాదం ఉంది.భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశంలో వానాకాలం సీజన్‌లో ఎరువులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దేశీయంగా ఉత్పత్తి తగ్గితే ఇతర దేశాల నుండి భారీ ధరలకు యూరియాను దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడానికి కారణం కావడమే కాకుండా, ప్రభుత్వం ఇచ్చే ఎరువుల సబ్సిడీలపై అదనపు భారం పడేలా చేస్తుంది. యూరియా కొరత వల్ల సాగు ఖర్చులు పెరిగి, చివరకు నిత్యావసరాల ధరలు పెరిగే (ద్రవ్యోల్బణం) అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పరిశ్రమ వర్గాలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాయి.


Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com